క్లుప్తంగా...

తైక్వాండోలో సత్తాచాటిన క్రీడాకారులు



కీసర: జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో నాగారం మున్సిపాలిటీ పరిధిలోని టైగర్ కబ్స్ తైక్వాండో అకాడమీకి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. 3 బంగారు, 5 వెండి, 13 కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ జి.శివకుమార్ తెలిపారు.

ఆరోగ్య మహిళా క్లినిక్‌లో తనిఖీ



పోచారం: నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా క్లినిక్‌ను డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది హాజరు, ఓపీ, స్టాక్, ఇమ్యునైజేషన్, టెలికన్సల్టేషన్ రిజిస్టర్లు, ఫార్మసీ గది, ల్యాబ్‌లను పరిశీలించారు.

బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నర్సింహ



పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అచ్చిని నర్సింహను బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి నియమించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నర్సింహను కమిటీలోకి ఆహ్వానించి, శాలువాతో మంగళవారం సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అమర మోహన్‌రెడ్డి, పోచారం మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్, రాష్ట్ర నాయకుడు రాజారమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేస్తాం



మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు పరిశీలించారు. వర్షాలకు పెచ్చులు ఊడుతున్నాయని కౌన్సిలర్ కొడే మహేష్ ఫిర్యాదు చేయడంతో ఆయన కౌన్సిలర్‌తో కలిసి భవనాన్ని పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేస్తామని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: సమాజ అభివృద్ధి కోసం నేటి యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏఐవైఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం' పేరిట రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఎస్సైలు అశోక్, శేఖర్, శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, మండల కార్యదర్శి శివ, కార్యవర్గ సభ్యులు సోమన్న, ఆనంద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాడివేడీగా కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కీసర: కీసర పరిషత్ సర్వసభ్య సమావేశంలో వివిధ సమస్యలపై వాడివేడీగా చర్చ కొనసాగింది. కీసర ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో విద్యుత్ సమస్యలపై పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విద్యుత్ అధికారుల తీరుపై మండిపడ్డారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. పెద్దఎత్తున సమస్యలను సమావేశంలో వివరించారు. వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీవత్సల, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు తటాకం నారాయణ, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కందాడి ప్రమీల, కిరణ్‌జ్యోతి, పండుగ కవిత, సర్పంచులు గోపాల్‌రెడ్డి, పుట్టరాజు, ధర్మేందర్, పెంటయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మో.. మైసమ్మగూడ



మైసమ్మగూడలోని హాస్టళ్ల వద్ద చెరువును తలపిస్తున్న వరద నీరు



మైసమ్మగూడ ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు వరదనీరు

- బిక్కుబిక్కుమంటూ గడిపిన విద్యార్థులు
- జేసీబీలు, ట్రాక్టర్లలో సురక్షితంగా తరలింపు
- చెరువులు, కుంటల కబ్జాలతోనే దుస్థితి
- కబ్జాలపై అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- భారీగా ముడుపులు అందాయంటున్న జనం
- తూతూమంత్రంగా అధికారుల చర్యలు
- ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడని వైనం
- పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- భారీ వర్షాలు కురిస్తే విద్యార్థులకు సెలవులు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు

హాస్టళ్లలో మొదటి అంతస్తు వరకు వరద

మేడ్చల్‌రూరల్:

భారీ వర్షానికి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడ గ్రామం మంగళవారం అతలాకుతలమైంది. స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలు అలుగులు పారడంతో పాటు ఎగువ నుంచి పెద్దఎత్తున వరద నీరు రావడంతో కళాశాలలకు నిలయంగా ఉన్న మైసమ్మగూడలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలు, పదుల సంఖ్యలో హాస్టళ్లు నీటిలో మునిగాయి. ప్రధాన రహదారి, హాస్టళ్లు, కళాశాలలు ఉన్న ప్రాంతాలు చెరువులను తలపించాయి. పలు హాస్టళ్లలో మొదటి అంతస్తు వరకు నీరు చేరింది. ఆహారం, విద్యుత్ సరఫరా లేకపోవడం, బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రాంగణం చెరువును తలపించింది.

ఇబ్బందులు పడుతూ పరీక్షకు..

మైసమ్మగూడలో మల్లారెడ్డి యూనివర్సిటీతో పాటు పదుల సంఖ్యలో మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలు, సెయింట్ పీటర్స్, నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు స్థానికంగా ఉన్న ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ విద్య అభ్యసిస్తున్నారు. మంగళవారం పలువురు విద్యార్థులకు కళాశాలలో సెమిస్టర్, ఇంటర్నల్ వంటి పరీక్షలు ఉండటంతో ఇబ్బందులకు గురయ్యారు. వర్షం కారణంగా వరద నీటిలో హాస్టల్ నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందని విద్యార్థులు కళాశాల యాజమాన్యాలను సమాచారం ఇచ్చినా, వీడియోల ద్వారా మొర పెట్టుకున్నా పలు కళాశాలలు పరీక్షలు రాయాల్సిందేనని ఆదేశించడంతో చేసేదేమి లేక విద్యార్థులు మోకాలు లోతు నీటిలో భయంభయంగా కళాశాలలకు చేరుకున్నారు.

పరిస్థితిని సమీక్షించిన అడిషనల్ కలెక్టర్..

మైసమ్మగూడను వరద ముంచెత్తడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య పరిస్థితిని సమీక్షించారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు పెంటయ్య, మల్లిఖార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, బాలరాజ్‌తో కలిసి వరద ఉధృతిని పరిశీలించారు. కళాశాలల యాజమాన్యాలకు సెలవులు ప్రకటించాలని ఆదేశించారు. దీంతో కళాశాలలు 5 రోజుల సెలవులు ప్రకటించడంతో రెస్క్యూ టీమ్స్, మున్సిపల్ సిబ్బంది, పోలీసుల సాయంతో విద్యార్థులను జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో హాస్టల్ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

నాలాలు, కుంటల కబ్జానే కారణం..

మైసమ్మగూడలోని హాస్టళ్లు, పలు ఇంజినీరింగ్ కళాశాలలు వరద నీటిలో మునిగిపోవడానికి ప్రధాన కారణంగా సమీపంలో ఉన్న నాలాలు, చెరువులు, కుంటలు కబ్జాలకు గురి కావడమేనని స్థానికులు అంటున్నారు. జూలై నెలలోనూ భారీ వర్షాల కారణంగా హాస్టళ్లు, రోడ్లు వరద నీటిలో మునిగిపోవడంతో విద్యార్థులను జేసీబీల సాయంలో బయటకు తీసుకురాగా, కళాశాలలకు వారం రోజుల పాటు సెలవులు ఇచ్చి విద్యార్థులను ఇళ్లకు పంపారు. వరద ఉధృతికి కారణాలను అధికారులు, మున్సిపల్ యంత్రాంగం అన్వేషించి చర్యలు చేపట్టకపోవడంతో తాజాగా మరోమారు హాస్టళ్లు ముంపునకు గురవ్వగా విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలోని సర్వే నెంబర్ 647, 648లో 24 ఎకరాల్లో గల కోమటి కుంట చెరువు కబ్జాకు గురవ్వడం, చెరువు అలుగు పారితే నీరు బయటకు వెళ్లే ప్రధాన నాలా కబ్జా చేసి కొందరు అక్రమ నిర్మాణాలు, హాస్టళ్లు ఏర్పాటు చేయడంతో హాస్టళ్లు మునిగిపోయే పరిస్థితి నెలకొందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని తెలిపారు.

అధికారులకు భారీ ముడుపులు..

మల్లారెడ్డి యూనివర్సిటీ, కళాశాలలు, పదుల సంఖ్యలో ఇంజినీరింగ్ కళాశాలలో ఎడ్యుకేషన్ హబ్‌గా పేరుగాంచిన మైసమ్మగూడ ముంపునకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కొందరు చెరువు, కుంట, నాలాలను కబ్జా చేసి హాస్టళ్లు ఏర్పాటు చేసి డబ్బులు దండుకుంటున్నారు. హాస్టళ్లకు డబ్బులు చెల్లించిన విద్యార్థులు ఇబ్బందులు తెచ్చుకుంటున్నారు. వరదల సమయంలో హడావుడి చేసే అధికారులకు భారీగా ముడుపులు ముడుతుండటంతో ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వరద వస్తే విద్యార్థులకు సెలవులు..

భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ విద్యార్థులకు సెలవులు ఇచ్చి పంపుతున్నారు. హాస్టళ్లు, కళాశాలలు నీటిలో మునుగుతున్నా.. అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వరదలు వచ్చిన సమయంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట వర్షం కురిసి ఇలాంటి దుస్థితి ఏర్పడితే విద్యార్థులు రాత్రంతా భయాందోళతో గడపాల్సిన దుస్థితి వచ్చేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయాలని కోరుతున్నారు.



అలుగు పారుతున్న అత్వెల్లి చెరువు



జవహర్‌నగర్ చెన్నాపురం చెరువు

లోతట్టు ప్రాంతాలు జలమయం



సాక్షి, మేడ్చల్ జిల్లా: రెండు రోజులుగా పడుతున్న భారీ వర్షం, జల్లులతో నగర శివారు పట్టణాలు, గ్రామాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లోకి వరద నీరు చెరుతోంది. పలుచోట్ల కల్వర్టులు, డ్రైనేజీలు పొంగి పారాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రోడ్లు దెబ్బతిన్నాయి. మట్టి రోడ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది.

- జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో రోడ్లు పాడైపోయాయి. మైసమ్మగూడలో హాస్టల్ భవనాలతో పాటు పలు కాలనీలను వరద ముంచెత్తడంతో స్థానికులు, విద్యార్థులు తిప్పలు పడ్డారు.
- బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సాయినగర్, మల్లన్ననగర్, చెంగిచర్ల తదితర కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, దుండిగల్, ఘట్‌కేసర్, తూముకుంట, నిజాంపేట్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలు, నాలాలు దెబ్బతిన్నాయి. కీసర, శామీర్‌పేట్ మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాల్లో వర్షంతో రోడ్లు అధ్వాన్నంగా మారగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలోని పీర్జాదిగూడ నుంచి అన్నోజిగూడ బ్రిడ్జి వరకు నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులతో రోడ్లపై వరద నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.
- నాగారం నుంచి కీసర ప్రధాన రోడ్డుపై భారీగా వరద ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- జిల్లాలోని పలు చెరువు, కుంటలు, శిఖాలు, నాలాలకు సంబంధించిన స్థలాలు కబ్జాకు గురికావడంతో చిన్నపాటి వర్షాలకు సమీపంలోని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లు వరద నీటితో నిండిపోతున్నాయి. చెరువులు, నాలాల్లో అక్రమ నిర్మాణాలతో నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో రోడ్లు నరకానికి నకళ్లుగా తయారయ్యాయి.
- రెండేళ్ల క్రితం భారీ వర్షాలతో బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో తొమ్మిది కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ప్రభుత్వం 20 నెలల క్రితం రూ.110 కోట్లు విడుదల చేయగా, పనులు ఇటీవలే చేపట్టడంతో పరిస్థితి ఎప్పటిలాగే ఉంది.

ఎటుచూసినా నీరే..

మేడ్చల్, జవహర్‌నగర్, కీసర: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొరుతున్నాయి. వాగులు జోరుగా ప్రవహిస్తున్నాయి. మేడ్చల్, అత్వెల్లి, డబీల్‌పూర్ తదితర గ్రామాల చెరువులు అలుగులు పోస్తున్నాయి. మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో కాలనీలు, గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



కమ్యూనిటీ ఆస్పత్రిలోకి చేరిన వరద నీరు



రాంపల్లి చౌరస్తాలో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

15న వాయుసేనలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: భారతీయ వాయుసేనలో అగ్నిపథ్ స్కీమ్‌లో క్లారికల్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల15న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఓపెన్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగ యువతకు మాత్రమేనన్నారు. అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అగ్నిపథ్ స్కీమ్‌లో సెలక్షన్ అయిన అభ్యర్థులకు నాలుగు సంవత్సరాల తర్వాత 25 శాతం మందికి వాయుసేనలో ప్రేరణ కింద తిరిగి కొనసాగించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఈనెల 15న బేగంపేటలోని ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. పోస్టింగ్ జాబ్ నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

పేదలను పట్టించుకోని బీఆర్‌ఎస్

బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు



ఘట్‌కేసర్: బీజేపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదని బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక పేదలకు ఇచ్చిన తర్వాత స్థానికేతరులకు రెండు పడకల ఇళ్లు ఇవ్వాలని మేం కోరితే.. బీఆర్ఎస్ నాయకులు తమపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. మండలంలో నిర్మించిన ఇళ్లను స్థానిక పేదలకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే నియోజకవర్గంలో తిరగలేరని హెచ్చరించారు. నిస్వార్థంగా పేదల పక్షాన పోరాడే బీజేపీ నాయకులు, కార్యకర్తల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్, ఉప సర్పంచ్ నరేశ్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాయక్, మహిపాల్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, ప్రభంజన్, నరేశ్, అజయ్‌యాదవ్, కిసాన్ మోర్చా మున్సిపల్ అధ్యక్షుడు వీరారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, బస్వరాజ్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించేది ఉపాధ్యాయులేనని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. అందరూ గౌరవించే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఆయన అవార్డులను అందజేశారు. సభకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని భావిభారత పౌరులుగా తీర్చదిద్దే అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందన్నారు. ఉపాధ్యాయులంటే తనకెంతో గౌరవమని, వారికి సమాజంలో ఎంతో ఉన్నత స్థానం, గౌరవం ఉంటాయన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి, వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందన్నారు. జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి, జెడ్పీ సీఈఓ దేవసహాయం, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఉపాధ్యాయులకు సన్మానం

జవహర్‌నగర్: ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైందని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గీతాంజలి స్కూల్‌లో ఉపాధ్యాయులను ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్డిశెట్టి నాగరాణి, స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



గీతాంజలి స్కూల్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం

కీసర: ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉంటుందని ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీవత్సల, ఎంపీఓ వినూత్న, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌టీసీలో టీచర్స్ డే



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌టీఈ కళాశాలలో మంగళవారం టీచర్స్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు గోపాల్‌రెడ్డి, అధ్యాపకులకు జ్ఞాపికలను అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు



మేడ్చల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో పనిచేస్తున్న ఆరుగురు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా, ఒకరు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డులు పొందారు. మండలంలోని శ్రీరంగవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న వి.శారద రాష్ట్రస్థాయి ఉపాధ్యాయురాలిగా రవీంద్రభారతిలో మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రేంకుమార్(గుండ్లపోచంపల్లి) గడప నవీన్(అత్వెల్లి), మాణిక్యాలరావు(గౌడవెల్లి), కొండయ్య(నూతన్‌కల్), సుజాత (హనుమాన్‌నగర్, మేడ్చల్) రాంమోహన్(మునీరాబాద్)కలెక్టరేట్‌లో మంత్రి మల్లారెడ్డి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న నవీన్